క్లుప్తంగా

ఆధార్ కేంద్రంలో అవస్థలు

కొడంగల్: ప్రభుత్వ తరపున ఏపీజీవీబీలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం నిర్వాహకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని కార్డు దారులు ఆరోపించారు. బయో మెట్రిక్ కోసం అధికంగా డబ్బులు వసూళ్లు చేయటమే కాకుండా.. నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నేడు, రేపు అంటూ కేంద్రం చుట్టూ తిప్పుతు న్నారని కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి సోమశేఖర్ అన్నారు. ఆధార్ కేంద్రాన్ని రద్దు చేసి, మెరుగైన సేవలు అందించే వారికి కేటా యించాలని కోరారు. ఈ మేరకు అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన



పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

కొడంగల్: ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పత్తిని కొనుగోలు చేయాలని, రైతులకు ఇబ్బం ది కలగకుండా చూసుకోవాలని తహసీల్దార్ విజయకుమార్ నిర్వాహకులకు సూచించారు. గురువారం దౌల్తాబాద్ మండలం నీటూరు గ్రామ శివారులో కొనసాగుతున్న పత్తి కొను గోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. తూకాల పనితీరును గమనించారు. అనం తరం మండల పరిధి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరి శీలించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, రెవెన్యూ ఉద్యోగి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు డ్యాం



దెబ్బతిన్న రోడ్డు డ్యాం

ధారూరు: మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే మార్గంలోని రోడ్డుడ్యాం ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై పేర్చిన రాళ్లు బయటపడి, గుంతలు ఏర్ప డ్డాయి. దీంతో ఈ దారిలో పయనిస్తున్న వాహ నదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి డ్యాం కు మరమ్మతులు చేపట్టి, ప్రమాదాలను నివా రించాలని ప్రజలు కోరుతున్నారు.

ఓటరు నమోదుపై సమీక్ష



మాట్లాడుతున్న తహసీల్దారు వెంకటేశ్

బొంరాస్‌పేట: జనవరి 1 నాటికి 18 సంవత్స రాలు నిండినవారు, పేర్లు మార్పు, సవరణకు ఫారం-8, తొలగింపునకు ఫారం-7 సమర్పిం చాలని తహసీల్దారు వెంకటేశ్ అన్నారు. గురు వారం అన్ని రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 2కి.మీ. దూరంలో పోలింగ్ కేంద్రాలు ఉన్నా తమ దృ ష్టికి తేవాలని కోరారు. ఇందులో రెవెన్యూ ఇన్ స్పెక్టర్ రవీంద్ర, నాయకులు నర్సింహులు గౌడ్, బాబయ్యనాయుడు, మల్లేశ్ ఉన్నారు.

19న ప్రజావేదిక

కుల్కచర్ల: ఈ నెల 19న ప్రజావేదిక నిర్వహిం చనున్నామని ఎంపీడీఓ నాగవేణి ఒక ప్రకట నలో పేర్కొన్నారు. 1జనవరి 2021 నుంచి 18 డిసెంబర్ 2023 వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందం పరిశీలి స్తుందని తెలిపారు. అనంతరం ఆ వివరాలను అధికారులు, ప్రజలకు తెలియజేస్తామని వెల్ల డించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, ప్రజలు పాల్గొనాలని ఆమె సూచించారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి



కలెక్టరేట్ వద్ద సీఐటీయూ నాయకులు

అనంతగిరి: జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు రూ.9,500 వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అం దజేశారు. అనంతరం మాట్లాడారు. ప్రమాద బీమా రూ.15లక్షలు ఇవ్వాలని కోరారు. ఈఎ స్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి నెలా వేతనాలు వచ్చేలా చొరవ చూపాలని పేర్కొన్నారు. నాయకులు రాములు, మొగు లయ్య, కృష్ణయ్య, అశోక్ పాల్గొన్నారు.

ఇంటికి వెళ్లాకే అన్నీ!

పేరుకే 'నంబర్ వన్ పాఠశాల'
- సిబ్బంది నిర్వహణ లోపం.. విద్యార్థులకు శాపం
- వసతుల లేమితో బాలికలు విలవిల
- పట్టించుకోని విద్యాధికారులు!



పాఠశాల ఆవరణలో విద్యార్థినులు



నిరుపయోగంగా ఉన్న మూత్రశాలలు

పేరులో ఏమున్నది. పనితీరులో గమనించాలన్న సంగతి ఎలా ఉన్నా.. ఇక్కడి పాఠశాల పేరుగొప్ప పాత్రనే పోషిస్తోంది. వినడానికి 'ప్రభుత్వ నంబర్ వన్ పాఠశాల' బాగానే ఉంది. కానీ.. నిర్వహణలో పూర్తిగా విఫలం. విద్యాబుద్ధులు నేర్చుకోవడానికి సరస్వతి మందిరానికి వచ్చే పిల్లలకు.. కనీస వసతులు కొరవడి.. ఇంటికి వెళ్లాకే అన్నీ.. అన్నట్లు తెలుస్తోంది.

తాండూరు టౌన్: ఆ పాఠశాలలో వందలాది మంది బాలబాలికలు విద్యనభ్యసిస్తున్నారు. వీరంద రికీ నాలుగంటే నాలుగే మూత్రశాలలు ఉన్నాయి. అవి కూడా దుర్గంధ భరి తం. ఆ ధాటిని తట్టుకో లేక బాలురు ఆరు బయ టకు పరుగెత్తుతుండగా.. బాలికల సంగతి దయనీ యంగా మారింది. అంతే కాదు. భోజనం అనంతరం చేతులు శుభ్రం చేసుకోవడానికి అక్కడి ఆవరణలోని తాగునీటి ట్యాం కుల్లో నీరు లేదు. అవి అలంకార ప్రాయమేనని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులపై బాలికల తల్లిదం డ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెప్పుకో వడానికి వీలు కాని ఇలాంటి విషయాలను తమ లోనే దాచుకుని పిల్లలు నరకయాతన పడుతు న్నారని మండిపడుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వారు వ్యాధుల బారిన పడతారని ఆవే దన వ్యక్తంచేస్తున్నారు. కనీస సౌకర్యాలు కల్పించని పాఠశాల ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

కడుపు ఉగ్గపట్టుకొని..

పట్టణంలో ప్రైమరీ, హైస్కూల్ పాఠశాలలు 25 వరకు ఉన్నాయి. వాటిల్లో ఒకటిరెండు మినహా.. మిగతా వాటిల్లో కనీస సౌకర్యాలు కొరవడినట్లు సమాచారం. పట్టణంలోని సాయిపూర్‌లో కొనసా గుతున్న ప్రభుత్వ నంబర్ వన్ పాఠశాలలో బాలబాలికలు మూత్ర విసర్జనకు ఇబ్బంది పడుతున్నారు. ఉదయాన్నే బడికి వచ్చిన సమయం నుంచి ఇంటికి వెళ్లే వరకు కడుపు ఉగ్గప ట్టుకొని, పంటిబిగువన బాధను అణచిపెట్టుకోవా ల్సిన దుస్థితి కలిగింది. గంటల తరబడి మూత్ర విసర్జన చేయకపోవడం వలన బాలల ఆరోగ్యం దెబ్బతింటుందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

నీరు తాగడం మరిచారు

నంబర్ వన్ బడిలో సుమారు 1,300 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. వీరిలో బాలికల సంఖ్య 700కి పైగానే ఉంది. వీరికి గతంలో ఒకే మూత్రశాల ఉండేది. ఆరునెలల క్రితం మనఊ రు-మనబడి కార్యక్రమంలో మరో మూడు మూత్రశాలలు నిర్మించారు. వాటిలోకి నీటి సరఫరా కోసం ప్లాస్టిక్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. తాగు నీరు, ఇతర అవసరాల కోసం పాఠశాల ప్రాంగణం లో మూడు మోటారు బోర్లు ఉన్నాయి. కానీ బోర్లు వేసి, నీటిని ట్యాంకుల్లోకి మళ్లించే విషయంలో పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోం ది. ఫలితంగా విద్యా కుసుమాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరుగు దొడ్లలో నీటి సరఫరా లేక, వాటిని శుభ్రం చేయకపోవడంతో వాటిల్లోకి బాలికలు వెళ్లడమే లేదు. నీరు తాగడమూ మానే శారు. ఉదయం వేళల్లో పాఠశాలలో ఉచితంగా అల్పాహారం వడ్డిస్తున్నారు. టిఫిన్ తిన్న తరువాత ప్లేటు, చేతులు కడుక్కోవడానికి నీరు లేకపోవడంతో కాగితాలతో తుడుచుకుంటున్నారు. కొందరు బడికి కొంత దూరాన ఉన్న వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్లి ప్లేట్లు, చేతులు శుభ్రం చేసుకుంటున్నారు. ఇంతటి ఇబ్బందికర స్థితిలో విద్యార్థులు రోజులు నెట్టుకుం టూ రావడం దురదృష్టకరమని పలువురు అన్నారు.

కార్పొరేట్ విద్యకాదు.. కనీస వసతులు నిల్



ప్రైవేట్ వాటర్ ప్లాంట్ వద్ద చేతులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

ప్రైవేటు బడుల కంటే నాణ్యమైన విద్యను బోధిస్తామని, కార్పొరేట్ తరహాలో వసతులు కల్పిస్తామని పాలకులు చెప్పడమే కాని.. వాటిని ఆచరణలో పెట్టలేక పోతున్నారని స్థానికులు ఆరో పిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలలో మూత్రశాలలను రోజుకు కనీసం రెండుసార్లు శుభ్రం చేయించాలని, తదితర సౌక ర్యాలు కల్పించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు. ఇదే విషయమై.. మండల విద్యాధికారి వెంకటయ్య గౌడ్‌ను వివ రణ కోరగా, పాఠశాలల్లో తాగునీటితో పాటు ఇతర వసతులను కల్పించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదే అని చెప్పారు. లేని ఎడలా వారిపై శాఖాపరమైన చర్యలు ఉం టాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూసుకుంటామని తెలిపారు.

'రైతుబంధు'కు దరఖాస్తుల ఆహ్వానం



దౌల్తాబాద్: దరఖాస్తులు తీసుకుంటున్న ఏఈఓ



మోమిన్‌పేట: దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏఈఓ పెంటయ్య

దౌల్తాబాద్: కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన వారు యాసంగి సాగుకు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ శ్రీపతిరెడ్డి తెలిపారు. గురువారం నందారం గ్రామంలో అర్హుల నుంచి అర్జీలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. పట్టాపాసు పుస్తకం, ఆధార్, బ్యాంక్ జిరాక్స్‌ల కాపీలను దరఖాస్తు పత్రానికి జతపరచాలని సూచించారు. ఈ అవకాశాన్ని కొత్త పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు సద్విని యోగం చేసుకోవాలని చెప్పారు.

నేడు ఆఖరు

మోమిన్‌పేట: కొత్తగా పట్టాపాసు పుస్తకాలు పొందిన రైతులు 'రైతుబంధు'కోసం పేరు నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి యాదగిరి జయశంకర్ తెలిపారు. నమోదు కార్యక్రమం శుక్ర వారంతో గడువు ముగియనుందని ఆయన పేర్కొన్నారు. వానాకాలం సాగు తర్వాత పట్టా దారు పాసు పుస్తకాలు తీసుకున్న వారందరూ.. ఇందుకు అర్హులని వెల్లడించారు. దరఖాస్తు పత్రా నికి పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా, ఆధార్ జిరాక్సు కాపీలను జతచేసి, ఏఈఓలకు అంద జేయాలని తెలిపారు. సకాలంలో అర్జీ చేసుకోక పోతే తామేమీ చేయలేమని పేర్కొన్నారు.

రైతు భరోసాపై ఆందోళన వద్దు

బొంరాస్‌పేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామన్న ఆరుగ్యారంటీల్లో ఒక టైన రైతుభరోసా పెట్టుబడి సాయంపై లబ్ధిదా రులు ఆందోళన చెందవద్దని కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములు గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఏర్పుమళ్లలో మాట్లా డారు. రైతులు ఆందోళన చెందవద్దని, పథకం విధి విధానాల రూపకల్పనకు కొంత సమయం పడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ యాసంగికి పాతపద్ధతిలోనే ఎకరాకు రూ.5వేలు పెట్టుబడి సాయం అందించనుందని తెలిపారు. రూ.2లక్షల రుణమాఫీకి ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుం దని వెల్లడించారు. ఇదిలా ఉండగా.. కొత్తగా భూమి పట్టా పుస్తకాలు పొందిన పట్టాదారులు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని, ఫారానికి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాపుస్తకం నకలు జతచేసి ఏఈఓలకు క్లస్టర్ భవ నాల్లో అందజేయాలని సూచించారు.

నాణ్యతలోపం.. వాహనదారులకు శాపం



మురుగుకాలువపై ఏర్పడిన గుంత

తాండూరు టౌన్: పట్టణంలోని మల్లప్పమడిగె వద్ద ఇటీవలే మురుగుకాలువను నిర్మించారు. దానిపై పైకప్పు కూడా వేశారు. కానీ నాణ్యత లోపం వలన అది ధ్వంసం అయి, ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు, జన సంచారంతో రద్దీగా ఉండే ప్రదేశంలో గుంత ఏర్పడి రోజులు గడుస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని స్థాని కులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలువ నిర్మిం చిన నెలలకే ఇలా పైకప్పుపై పగిలి, గుంత ఏర్పడ టం నిర్మాణదారుల నిర్లక్ష్యమని, అధికారుల పర్యవే క్షణ లేకపోవడంతో పనుల్లో నాణ్యత లోపించిందని ఆరోపించారు. అధికారులు స్పందించి మరమ్మతు చేయించాలని డిమాండ్ చేస్తున్నారు.

పార్కింగ్ స్థలం కాదు.. మద్యం దుకాణం



వైన్స్ ఎదుట బారులు తీరిన లారీలు

లారీలకు అడ్డాగా మారిన వైనం

నవాబుపేట: మండల కేంద్రంలోని రోడ్డు పక్కనే ఉన్న మద్యం దుకాణం.. మైనింగ్ లారీలకు అడ్డాగా మారింది. నవాబుపేట మండలం వట్టిమీ నపల్లి, మాదిరెడ్డిపల్లి, ఆర్కతల, యావాపూర్ గ్రామాల్లో మైనింగ్ తవ్వకాలు కొంత కాలంగా జరుగుతున్నాయి. ఇంత వరకు బాగానే ఉంది. కానీ.. మైనింగ్ వాహనాలు మొత్తం మద్యం దుకాణం వద్ద పార్కింగ్ చేస్తుండటంతో ఇతర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తాగిన మైకంలో డ్రైవర్లు లారీలను నడపడం వలన ప్రమాదాలు జరుగుతాయని ఆందోళన చెందుతు న్నారు. జన సంచారం ఎక్కువగా ఉండే ఈ ప్రాం తంలో ఇలా అడ్డదిడ్డంగా వాహనాలు నిలపడం, మత్తులో వాహనాలు నడపడం మంచిది కాదని హితవు పలికారు. ఇలా వైన్స్ ఎదుట ఇంత తతంగం జరుగుతున్నా.. సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. తక్షణమే ఈ విషయంలో చర్యలు చేపట్టి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

తక్కువ ఖర్చుకే అంబులెన్స్ సేవలు

అనంతగిరి: ఏయం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వికారాబాద్‌లో గురువారం ఉచిత అంబులెన్స్ సర్వీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకుడు ఆనంద్ మాట్లాడారు. తక్కువ ఖర్చుతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు సేవలు అందిస్తామని చెప్పారు. అవసరం ఉన్న వారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్ర మంలో ప్రభుత్వ ఆస్పత్రి జిల్లా సూపరింటెం డెంట్ రాంచంద్రయ్య, వైద్యులు ఆనంద్, మృదుల, నాయకులు ఫకీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న వైద్యులు, నాయకులు

అమెజాన్ కృషి అభినందనీయం

- ఆకట్టుకున్న పాఠశాల సుందరీకరణ
- విద్యార్థులను ఆకిర్షస్తున్న గోడలపై బొమ్మలు: ఎంపీడీఓ అనురాధ

షాబాద్: మోడల్ స్కూల్‌లో మౌలిక వసతుల కల్పనకు అమెజాన్ వెబ్ సిరీస్ సంస్థ కృషి అభినం దనీయమని ఎంపీడీఓ అనురాధ అన్నారు. అమె జాన్ వెబ్ సిరీస్ సంస్థ ఇన్‌కమ్యూనిటీస్ ప్రోగ్రాంలో భాగంగా షాబాద్‌లోని మోడల్ స్కూల్ పునరుద్ధ రణ, సుందరీకరణ పనులు చేపట్టింది. ఆ పనులు పూర్తికావడంతో తెలంగాణ మోడల్ స్కూల్ అద నపు డైరెక్టర్ రమణకుమార్, జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు ఆదేశాలతో ఎంపీడీఓ అనురాధ గురువారం ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ ప్లానింగ్ అండ్ డెలివరీ వైస్ ప్రెసిడెంట్ కెర్రీపర్సన్‌తో కలిసి మోడల్ స్కూల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ అమెజాన్ వంటి సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో విద్యపై నూతనోత్తేజాన్ని కలిగి స్తాయన్నారు. పాఠశాల సుందరీకరణ, గోడలపై వేసిన బొమ్మలు విద్యార్థుల్లో సైన్స్, టెక్నాలజీ, కళలు, గణిత శాస్త్రాలపై ఆసక్తి పెంచుతాయన్నారు. ఈ సంస్థ.. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య సంర క్షణ కేంద్రాలు, ఆసుపత్రుల పునరుద్ధరణ వంటి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. అమెజాన్ వెబ్ సిరీస్ సంస్థ, సెర్ఫ్ సంస్థతో కలిసి 50 పామ్‌పాండ్‌ల అభివృద్ధి చేపడుతున్నామని సంస్థ ప్రతినిధి కెర్రీపర్సన్ తెలిపారు. ఎంఈఓ శంకర్ రాథోడ్, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

శంకర్‌పల్లి: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా మని శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీ టీసీ గోవిందమ్మ పేర్కొన్నారు. గురువారం మండ లంలోని లక్ష్మారెడ్డిగూడ గ్రామంలో అండర్‌డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచులతో పాటు ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఆర్టీసీ



ధర్నా చేస్తున్న విద్యార్థులు

దౌల్తాబాద్: ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటిం చాలని కోరుతూ గురువారం స్థానిక గాంధీ కూడలి వద్ద విద్యార్థులు ధర్నా చేశారు. దౌల్తాబాద్ నుంచి నీటూరు మీదుగా కొడంగల్ వెళ్లే సర్వీసు ఉదయం 8 గంటలకు రావాల్సి ఉండగా.. అది 9గంటలకు వస్తుందని ఆరోపించారు. ఆలస్యం వలన తాము తరగతుల సమయానికి వెళ్లలేక పోతున్నామని ఆవే దన వ్యక్తం చేశారు. అంతే కాకుండా విద్యాలయాల ముగింపు అనంతరం సమయ పాలన పాటించని బస్సుల వలన ఇంటికి వెళ్లే సరికి రాత్రికి 8గంటలు అవుతుందని వాపోయారు. కావున సంస్థ అధికా రులు స్పందించి, బస్సుల రాకపోకల్లో సమయపా లన ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్టీసీ అధికారులను కలిసి సమస్యను విన్నవి స్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

కృషి ఉంటే విజయం తథ్యం

షాద్‌నగర్‌రూరల్: ఏదైనా సాధించాలనే కృషి, పట్టుదల ఉంటేనే విజయం సాధ్యమని డాక్టర్ సజ్జ లజగదీశ్వర్ అన్నారు. గురువారం కిషన్‌నగర్ శివా రులోని ఇండియన్ హైట్స్ పాఠశాల వ్యవస్థాపకుడు సజ్జల దాక్షాయనీ, సజ్జలభువనేశ్వర్ ఆధ్వర్యంలో పాఠశాల వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లా డుతూ ప్రతి విద్యార్థి వినయంతో కూడిన జ్ఞానాన్ని పెంపొందించు కోవాలని సూచించారు. క్రమ శిక్షణతో కూడిన విద్య అవసరం అని, నేటి బాలలే భావి భారత పౌరులని, ప్రతి విద్యార్థి ఉన్నత విద్యా వంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు.



వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టగా.. ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం శాసనసభ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు - అనంతగిరి

ప్రమాద బీమాతో.. ధీమా

- వంట బండకు క్లెయిమ్
- సిలిండర్ పేలితే రూ.40లక్షల వరకు పరిహారం



షాబాద్: ప్రస్తుత కాలంలో వంట గ్యాస్ లేని కుటుం బం లేదు. అది ప్రతి ఒక్కరికీ నిత్యావసరంగా మారింది. ఒక్కోసారి గ్యాస్ లీకేజీ, విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అజాగ్రత్తల వలన పేలుళ్లు సంభవిస్తుం టాయి. అయితే దీనికి సంబంధించి ఆయా ఎల్పీజీ సంస్థలు అందిస్తున్న బీమా సదుపాయం వినియో గదారులకు ధీమా కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో వంట గ్యాస్ వలన ప్రమాదం సంభవిస్తే బీమా క్లెయిమ్ ఎలా చేసుకోవాలి? నిబంధనలు ఏమిటీ? తదితర వివరాలు ఈ క్రింది విధంగా ఉంటాయి.

పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్..

ఎల్పీజీ వినియోగదారులకు పబ్లిక్ లయబిలిటీ ఇన్స్యూరెన్స్ కింద బీమా సౌకర్యం కల్పిస్తున్నాయి. ఆయా కంపెనీల్లో నమోదైన ప్రతి ఖాతాదారుడికీ ఇది వర్తిస్తుంది. ఈ పాలసీలో థర్డ్ పార్టీ బీమా కూడా మిళితమై ఉంటుంది.

డీలర్ నుంచే క్లెయిమ్

వంట గ్యాస్ సిలిండర్ పేలితే వెంటనే సంబంధిత కంపెనీ డిస్ట్రిబ్యూటర్ లేదా డీలర్‌కు విషయం తెలి యజేయాలి. అతడు ఆ కంపెనీ సేల్స్ అధికారికి సమాచారం ఇస్తారు. ఈ క్రమంలో సేల్స్ అధికారి, స్థానిక తహసీల్దార్, బీమా సర్వేయర్, అగ్నిమాపక శాఖ అధికారి వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించి చుట్టుపక్కల వారిని విచారిస్తారు. అనంతరం క్లెయిమ్ చేస్తారు. గ్యాస్ సిలిండర్ ఎక్కడ బుక్ చేసు కుంటారో ఆ డీలర్ నుంచే క్లెయిమ్ అవుతుంది.

మృతులకు పరిహారం ఇలా...

గ్యాస్ ప్రమాదంలో వ్యక్తి మృతి చెందితే సుమారు రూ.6లక్షలు, గాయాలైతే రూ.25వేల నుంచి రూ.2లక్షల వరకు ప్రమాదం జరిగిన సమయంలో గృహోపకరణాలు, ప్రమాదం చోటు చేసుకున్న విధానం, ఇంటికి నష్టం జరిగితే సర్వేయర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా రూ.2లక్షల వరకు పరిహారం చెల్లిస్తారు. అలాగే, వినియోగదారుడి ఇంట్లో గ్యాస్ లీక్ వల్ల చుట్టు పక్కల ఉండే నివాసాల్లో ప్రమాదం జరిగితే ఆ ప్రమాదానికి సంబంధించి మొత్తం కలిపి రూ.40 లక్షల బీమా వర్తిస్తుంది.

డిస్ట్రిబ్యూటర్‌కు సమాచారం..

సిలిండర్ పేలితే వెంటనే డిస్ట్రిబ్యూటర్‌కు సమా చారం అందించి, కంపెనీ పుస్తకం, బుక్ చేసుకున్న రశీదు, ప్రమాదం జరిగిన ఇంటి నంబర్, పరి హారం కోరుతూ అర్జీతో పాటు డిస్ట్రిబ్యూటర్ వద్ద ఉండే బీమా క్లెయిమ్ దరఖాస్తును పూర్తి చేసి అంద జేయాలి. వంట గ్యాస్ ప్రమాదం, ఇన్స్యూరెన్స్ గురించి పౌరసరఫరాల శాఖకు ఎలాంటి సంబం ధం ఉండదు.

గ్యాస్ ఏజెన్సీలు ఏం చేయాలి..

గ్యాస్ ప్రమాద బీమాపై సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం కల్పించాలి. బీమాపై విస్తృత ప్రచారం చేపట్టాలి. వినియోగదా రుల సేవలు, ప్రమాదాలు, పరిహారంపై సంస్థలు ఇచ్చే భరోసాపై చైతన్యం కలిగించాలి. ఏజెన్సీ ప్రతినిధులు రెండేళ్లకోసారి వినియోగదారులు వాడుతున్న గ్యాస్ పొయ్యిలు, సిలిండర్, రెగ్యులేట ర్లను పరిశీలించాలి.

వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఇళ్లు, హోటళ్లు, వసతి గృహాల్లో వంట గ్యాస్ విని యోగదారులు ప్రతి మూడు, ఆరు నెలలకు ఒక సారి పొయ్యిలను ఏజెన్సీ నియమించిన మెకానిక్ లతో పరిశీలింపజేయాలి. రెగ్యులేటర్‌కు, ప్యాయికి అనుసంధానం చేసేందుకు నాణమైన పైపునే వాడా లి. సిలిండర్‌కు దగ్గరలో మండే వస్తువులు ఉంచ కూడదు. వంట గదిలోకి తగినంత గాలి, వెలుతురు వచ్చేలా చూసుకోవాలి. సిలిండర్‌ను సులువుగా బయటకు తెచ్చేందుకు అవకాశం ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. సిలిండర్ ఎప్పుడు నిలువుగా ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లో అడ్డంగా ఉం చరాదు. సిలిండర్ కంటే పొయ్యిని ఎక్కువ ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలి. గ్యాస్ లీకైనప్పుడు బరువైన మిథెన్ వాయువు భూమిని చేరి తర్వాత పైకి వస్తుం ది. గ్యాస్ లీకైనట్లు అనుమానం వస్తే విద్యుత్ పరిక రాలు, స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయొద్దు. రెగ్యులేటర్‌ను ఆఫ్ చేసి మూత పెట్టాలి.

కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు..

- మరణాలు చోటు చేసుకుంటే మరణ ధ్రువీకరణ పత్రం, పోస్టుమార్టం రిపోర్ట్, అగ్నిమాపక అధికారి నివేదిక, ప్రమాదం జరిగినట్లు రిపోర్ట్ పత్రాలు ఒరిజినల్స్ జత పరచాలి.
- గాయపడిన సందర్భాల్లో వైద్యుడి ప్రిస్క్రిప్షన్, మందులు కొనుగోలు చేసినట్లు దుకాణం నుంచి పొందిన బిల్లులు, ఆసుపత్రిలో చికిత్స పొం దినట్లు వైద్యుడి ధ్రువీకరణ పత్రం, డిశ్చార్జి కార్డు జతచేయాలి.
- ఆస్తి నష్టానికి సంబంధించిన బీమా కంపెనీ సర్వేయర్ ఇచ్చిన ధ్రువీకరణ పత్రం ఉండాలి. లేని యెడల బీమా వర్తించదు.
- సిలిండర్ బుక్ చేసుకున్న ఇంటి నంబర్ కాకుం డా మరో ఇంట్లో ప్రమాదం జరిగితే బీమా వర్తిం చదు.
- సిలిండర్ లీకైనప్పుడు మాత్రమే బీమా క్లెయిమ్ చేస్తారు. ప్రమాదానికి సంబంధించిన ప్రాంతం, వివరాలు, ఏడు రోజులలోపు సంబంధిత బీమా కంపెనీకి అందినప్పుడే ఈ బీమా క్లెయిమ్ అవుతుంది.
- ఉద్దేశపూర్వకంగా ప్రమాదం సంభవించిందని వినియోగదారుడిపై అనుమానం వచ్చి, పోలీస్ విచారణ జరుగుతున్నట్టయితే బీమా వర్తించదు.